ప్రజాశక్తి

సోమవారం 18 మార్చి 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

ఆల్ ద బెస్ట్

- నేటి నుండి పదో తరగతి పరీక్షలు - ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు
- గుంటూరు జిల్లాలో 31,291 మంది, పల్నాడు జిల్లాలో 29,243 మంది చొప్పున హాజరుకానున్న విద్యార్థులు
- హాల్ టిక్కెట్ చూపితే బస్సుల్లో ఉచిత ప్రయాణం - యాజమాన్యాలు హాల్‌టిక్కెట్ నిరాకరిస్తే గుర్తింపు రద్దు

8 లో

మార్చి నుండే మండుతున్న ఎండలు

3 లో

ఏప్రిల్, మేలో ఇంకా తీవ్రంగా పెరుగుతాయని అంచనా

అమరావతి ఊసెత్తని మోడీ

- రాజధాని రైతులకు నిరాశ
- రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించని ఎన్‌డిఎ సభ
- వైసిపిపై విమర్శలు, కేంద్రంపై ప్రశంసలు

అభివాదం చేస్తున్న నరేంద్ర మోడీ, చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద టిడిపి, జనసేన, బిజెపి ఆధ్వర్యంలో జరిగిన ప్రజాగళం బహిరంగ సభ ప్రజలకు ఎటువంటి భరోసానూ కల్పించలేకపోయింది. రాజధాని అమరావతి రైతులకు తీవ్ర నిరాశ మిగిలింది. ప్రధాని మోడీ ప్రసంగానికి ముందు మాట్లాడిన చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ అమరావతి రాజధాని గురించి ప్రస్తావించలేదు. చంద్రబాబు, పవన్ వైసిపిని, సిఎం జగన్‌ను విమర్శించారు. మోడీని పొగడ్తలతో ముంచెత్తారు. మోడీ కూడా తన ప్రసంగంలో తమ కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రానికి జరిగే మేలు ఏమిటో చెప్పలేదు. వైసిపి పాలనపై సునిశితంగా విమర్శలు చేశారు. అవినీతి పెరిగిందని, అభివృద్ధి జరగడం లేదని విమర్శలు చేశారు. కేంద్రంలో, రాష్ట్రంలోనూ ఒకే కూటమి అధికారంలో ఉంటే అభివృద్ధి బాగా జరుగుతుందని మాత్రమే మోడీ చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే తాను కోటప్పకొండ సమీపంలోని చిలకలూరిపేట సభకు వచ్చానన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. వికసిత్ భారత్ మాదిరిగా వికసిత్ ఆంధ్ర ప్రదేశ్ నినాదంతో ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి పోటీ చేస్తుందన్నారు. ఎన్‌డిఎ కూటమిపై ప్రజల్లో అభిమానం పెరిగిందని, జగన్‌రెడ్డి ప్రభుత్వంపై ఉన్న కోపంతో ప్రజలు ఈ సభకు భారీగా వచ్చారని అన్నారు. రాష్ట్రంలోని మంత్రులు పరిపాలన కంటే.. ఎవరు ఎక్కువ అవినీతి చేస్తారో అనే అంశంపైనే దృష్టి పెట్టారు. రాష్ట్ర అభివృద్ధిని ఆకాంక్షించే వారంతా కూటమిని గెలిపించుకోవాలన్నారు. 2014 నుంచి 2019 మధ్య మంజూరుచేసిన విద్యా, వైద్య సంస్థల గురించి ఏకరవుపెట్టిన మోడీ రాజధానితోపాటు రాబోయే కాలంలో ప్రజా సమస్యల పరిష్కారంపై ఎటువంటి ప్రస్తావనా చేయలేదు.

రాజధానికి పూర్వ వైభవం కల్పిస్తానని మోడీ ప్రకటిస్తారని ఆశపడిన రైతులకు నిరాశ మిగిలింది. పలువురు అమరావతి రైతులు మోడీ రాకతో అమరావతికి పూర్వ వైభవం అంటూ ప్లకార్డులు పట్టుకుని గ్యాలరీలో

2లో

పాలడుగులోని విగ్రహాలకు వేసిన ముసుగులు

ఎన్నికల కోడ్ అమలులో యంత్రాంగం నిమగ్నం

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని అన్ని గ్రామాలలో ఎన్నికల కోడు నియమావళిని అధికారులు అమలుకు పూనుకున్నారు. ఇందులో భాగంగా 14 గ్రామాల్లోని వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. మేడికొండూరు తహశీల్దార్ కోనూరి రాజ్యలక్ష్మి ఆదేశాల మేరకు పాలడుగులోని విగ్రహాలకు ముసుగులు వేశారు. ఇతర గ్రామాల్లోని రాజకీయ పార్టీలకు సంబంధించిన వివిధ రకాల జెండాలను, ఫ్లెక్సీలనూ తొలగించారు.

ఎన్నికల ఫిర్యాదులపై 100 నిముషాల్లో స్పందన

పోస్టర్లు, కరపత్రాలపై ప్రెస్‌పేరు, ప్రతుల సంఖ్య లేకుంటే నోటీసులు : పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నికల షెడ్యూల్ నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని కఠినంగా అమలు చేయాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బందితో జెసి ఎ.శ్యాంప్రసాద్‌తో కలిసి కలెక్టర్ ఆదివారం సమీక్షించారు. ప్రవర్తన నియమావళి, వ్యయ ఉల్లంఘలను ఇతర ఏమైనా ఉల్లంఘాలను నివేదించడానికి నిర్దేశించిన సి.విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు అందిన 100 నిముషాల్లో స్పందించాలని, ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వీటిని రిటర్నింగ్ అధికారులు పరిశీలించాలని చెప్పారు. ఎన్నికల కమిషన్‌కు రోజువారీ సమర్పించాల్సిన నివేదికలు సకాలంలో సమర్పించేలా పూర్తి శ్రద్ధ పెట్టాలన్నారు. బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్నికలు కమిషన్ నిషేధించిన ఫొటోలు, బ్యానర్లు వెంటనే తొలగించడంలో నిర్లక్ష్యం కూడదన్నారు. ఎన్నికల కంట్రోల్ రూంకు, ఇతర రూపాల్లో అందిన ఫిర్యాదులపై 24 గంటలలో చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించిన కరపత్రాలు, ముద్రణకు సంబంధించి ముందస్తు అనుమతులు తప్పనిసరని, దీనిపై ప్రింటర్స్ యాజమాన్యంతో రిటర్నింగ్ అధికారులు సమావేశమై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రచురుణలపై ప్రింటింగ్ ప్రెస్ పేరు, ప్రతుల సంఖ్య తప్పనిసరిగా ముద్రించాలన్నారు. లేకుంటే సంబంధిత ప్రింటర్స్‌కు నోటీసులు జారీ చేస్తామని స్పష్టం చేశారు.

కంట్రోల్ రూమ్‌లో వివరాలు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్

కంట్రోల్‌లో పరిశీలన

ఎన్నికల నేపథ్యంలో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి ఎన్నికల కంట్రోల్ రూంను కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదివారం సందర్శించారు. ఎన్నికలకు సంబంధించిన యాప్‌లు ఏవి? ఎలా పర్యవేక్షిస్తున్నారు? అనే విషయాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలన్నారు.

టిజెపిఎస్ కేంద్రంలో ప్రశ్నాపత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

గ్రూప్-1 పరీక్ష ప్రశాంతం

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో 23 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు జరిగాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1 పరీక్ష, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పేపర్ 2 పరీక్ష నిర్వహించారు. ఉదయం 8,785 మంది హాజరవగా, 6,254 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 8,714 మంది హాజరవగా 6,325 మంది గైర్హాజరయ్యారు. స్థానిక టీజెపీఎస్ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో జరిగిన స్క్రీనింగ్ పరీక్షలను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి పరిశీలించారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమవారం సాయంత్రం) : 6.24

సహరీ (మంగళవారం ఉదయం) : 4.57

చెన్నారెడ్డికి శాలువా కప్పి సన్మానిస్తున్న ఎమ్మెల్సి అప్పిరెడ్డి

అప్పిరెడ్డి, మాణిక్యవరప్రసాద్‌ను కలిసిన చెన్నారెడ్డి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

గుంటూరు జిల్లా వైసిపి ప్రధాన కార్యదర్శిగా ప్రత్తిపాడు నియోజకవర్గ కేంద్రంలోని గంగిరెడ్డి చెన్నారెడ్డిని నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా వైసిపి అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్‌ని, ఎమ్మెల్సి లేళ్ల అప్పిరెడ్డిని చెన్నారెడ్డి ఆదివారం కలిసి కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఓం ప్రకాష్ రెడ్డి, ఉదయగిరి మురళి, శివారెడ్డి, వసంతరావు, యనమల శ్రీనివాసరెడ్డి, జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎంకు మద్దతివ్వాలని ప్రచారం

ప్రజాశక్తి - విజయవాడ

60వ డివిజన్ వాంబే కాలనీ 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరి పేటలో మార్పు కోసం పాదయాత్ర ఇంటింటికీ కరపత్రాలు ఆదివారం పంచారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ విజయవాడ నగరం అభివృద్ధి చెందాలంటే రెండో ఫ్లైఓవర్ నిర్మించాలంటే సిపిఎంకు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. వాంబే కాలనీలో ఇంటి స్థలాలు ఇంటిపట్టాలు రిజిస్ట్రేషన్ చేయించాలన్న చెత్త పనులు రద్దు చేయాలన్నా సిపిఎంను గెలిపించాలని కోరారు. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం అవ్వాలంటే కమ్యూని స్టులకు మద్దతు తెలపాలని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించాలని, బిజెపి ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్న టిడిపి, జనసేనలను ఓడించాలని చెప్పారు. కార్మిక సమస్యలు పరిష్కరిం చాలంటే సిపిఎంను బలపరచాలని పాయకాపురం రాజీవ్‌నగర్ శాంతినగర్‌లో మంచినీటి సమస్య తీరాలంటే సిపిఎంకు డిస్నీలాండ్‌లో 57 ఎకరాల భూమిని ఇంటి స్థలాల కోసం కేటాయించాలని అవి అమలు చేయడం సిపిఎం ద్వారా అవుతుందన్నారు.

ప్రజల కోసం నిలబడే ఏకైక పార్టీ సిపిఎం అని దానికి మద్దతు తెలిపాలని కార్మికుల సమస్యల కోసం పోరాడే సిపిఎంకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణరావు, అధ్యక్షులు కె.దుర్గారావు సిపిఎం నాయకులు, ఎస్కె పేరు రాంబాబు నాగేశ్వరరావు రాంబాబు, సాంబిరెడ్డి 57 డివిజన్ టి.శ్రీను, ఎంవి.రమణ, టి.సాయి, రాజులమ్మ పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - విజయవాడ : రాబోవు ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం కాని, చట్ట విరుద్ధమైన పనుల్లో పాలుపంచుకోవడం కానీ పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ చూస్తూ ఊరుకునేది లేదని, ఎన్నికల ప్రక్రియను, ఓటింగ్ సరళిని ప్రభావితం చేసే ఏ అంశంలోనూ భాగస్వాములు కాకూడదని రౌడీ షీటర్లను డిసిపి హరికృష్ణ హెచ్చరించారు. ప్రతీ ఆదివారం నిర్వహించే సాధారణ కౌన్సెలింగ్‌లో భాగంగా డిసిపి హరికృష్ణ రౌడీషీటర్లతో పైన తెలిపిన హెచ్చరికలు చేస్తూ జీవితం చాలా విలువైనదని అనవసరంగా నేరాల్లో పాల్గొని జైలుపాలై తల్లిదండ్రులకు, భార్యా పిల్లలకు, బంధువులకు తలవంపులు తేవొద్దని, కుటుంబాలు చిన్నాభిన్నం చేసుకుని తమ, పిల్లల భవిష్యత్తును అస్తవ్యస్తం చేసుకోవద్దని హితవు పలికారు.

1524 మంది.. ఏడు పరీక్షా కేంద్రాలు

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణం, మండలంలో 1524 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. వీరి కోసం ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఒక్కొక్క పరీక్షా కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు, డిపార్ట్మెంట్ ఆఫీసర్‌ను నియమించారు. 200 మంది విద్యార్థులు పైగా ఉన్న పరీక్షా కేంద్రంలో అదనంగా మరొక అధికారిని నియమించారు. విద్యార్థులు ప్రశాంత వాతా వరణంలో పరీక్షలు రాసినందుకు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లు ఉండకూడదని అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం నుండి ప్రారంభమయ్యే మొదటి రోజున తెలుగు పరీక్ష జరుగుతుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఉదయం 9.30 నిమిషాల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు రెగ్యులర్‌తో పాటు, ఒకేషనల్ పరీక్షలు ఈ నెల 30వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. నిడుబ్రోలు జెడ్పీ హైస్కూల్లో 314 మంది, నిడుబ్రోలు ఐదవ వార్డు మున్సిపల్ హైస్కూల్లో 180, పొన్నూరు ఎం.వి. ఆర్.ఎస్ వివేక హైస్కూల్ 180, నిడుబ్రోలు అనిల్ అండ్ ప్రసాద్ హైస్కూల్లో 296, నేతాజీ నగర్ మున్సిపల్ హైస్కూల్లో 178, పచ్చలితాడిపర్రు జెడ్పీ హైస్కూల్లో 200, చింతలపూడి జెడ్పీ హైస్కూల్లో 176 మంది చొప్పున విద్యార్థులు పరీక్ష రాయనున్నారు.

నిడుబ్రోలు జెడ్‌పి పాఠశాలలో పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన బల్లలు

విజయపురిసౌత్‌లో రెండు పరీక్షా కేంద్రాలు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

నేటి నుంచి 10వ తరగతి పరీక్షలు జరగనున్నాయి. పరీ క్షలకు సంబంధించి సంబంధిత అధికారులు ఇప్పటికే పగడ్బందీగా ఏర్పాట్లు చేశారు. మాచర్ల పట్టణంలో మొత్తం 6 పరీక్ష కేంద్రాలు, విజయపురిసౌత్‌లో 2 పరీక్ష కేంద్రాలను సం బంధిత అధికారులు ఏర్పాటు చేశారు. పట్టణానికి సం బంధించి కిడ్స్ పాఠశాల 1,2 కేంద్రాలు, జడ్పీ బాలుర పాఠ శాల, జడ్పీ బాలికోన్నత పాఠశాల, సెంటెన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల, సెంటెన్స్ తెలుగు మీడియం పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఆరు పరీక్ష కేంద్రాలలో సుమారు 1400 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

విజయ పురిసౌత్ కు సంబంధించి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పిటిజి బాలుర పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఇప్ప టికే సంబంధిత అధికారులు పకడ్బందీగా పరీక్ష ఏర్పాట్లు చేశారు.

బిజెపి, దాని మద్దతుదారుల ఓటమే లక్ష్యం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-గన్నవరం

కేంద్రంలోని బిజెపి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందని, దానిని ఓడించడమే లక్ష్యంగా లౌకిక, ప్రజాస్వామ్యవాదులు కదలాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో గన్నవరంలో లౌకిక శక్తులు, కాంగ్రెస్, సిపిఐ బలపరిచిన సిపిఎం అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ స్థానిక అట్లూరి శ్రీమన్నారాయణ మీటింగ్ హాల్లో సమావేశం నిర్వహించారు. సమావేశానికి సిపిఎం నాయకులు టివిఎల్ లక్ష్మణస్వామి అధ్యక్షత వహించగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు ధారాదత్తం చేయడంలో మోడీ ప్రత్యేక ప్రధానిగా గుర్తింపు పొందారని విమర్శించారు. ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇవ్వకుండా యువకులను మోసం చేశారన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించడానికి మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చారని, రైతులు పెద్ద ఎత్తున పోరాటం చేయడంతో వెనక్కి తగ్గారని తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో 370 పార్లమెంటు స్థానాల్లో బిజెపి గెలుస్తుందని చెబుతున్నారని, అదే జరిగితే దేశం ప్రమాదంలో పడటం ఖాయమని స్పష్టం చేశారు. ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను దారి మళ్లించేందుకు మతం పేరుతో గొడవలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని బిజెపి ప్రయత్నిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన పార్టీలు బిజెపితో కలిసి ముందుకు వెళ్లేందుకు సిద్ధమవ్వగా వైసిపి రహస్య ఒప్పందంతో ముందుకు వెళుతున్నాయని విమర్శించారు. బిజెపికి మద్దతు తెలిపే పార్టీలను రాష్ట్రంలో చిత్తుగా ఓడించాలన్నారు. గన్నవరం నియోజకవర్గంలో సిపిఎంకు ప్రత్యేకమైన గుర్తింపు ఉందన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య మూడు సార్లు ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించి దేశంలోనే గన్నవరానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చారని వివరించారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా వారికి అండగా నిలబడేది ఎర్రజెండా మాత్రమేనని చెప్పారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గంలోని 84 పంచాయితీల్లో ప్రతి గ్రామంలో సిపిఎం అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ విస్తృత ప్రచారం చేయాలన్నారు. ప్రతి ఇంటికి కరపత్రం తీసుకువెళ్లి ప్రజలను చైతన్యపరచాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.రఘు, ఎం.హరిబాబు, కళ్లం వెంకటేశ్వరావు, మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు, నాయకులు అనుమోలు వెంకటేశ్వరావు, బి.శ్రీను, బుద్ధవరం సర్పంచ్ బడుగు బాలమ్మ, ఐద్వా నాయకురాలు జ్యోతి, ఆర్థిక విశ్లేషకులు గన్నె వెంకట్రావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు

అమరావతి ఊసెత్తని మోడీ

(మొదటి పేజీ తరువాయి)

కూర్చున్నారు. కానీ ఎవ్వరూ సభలో ఆ ప్రస్తావన చేయలేదు. సభలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, బిజెపి అధ్యక్షులు పురందేశ్వరి, టిడిపి నుంచి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, యనమల రామకృష్ణుడు, నందమూరి బాలకృష్ణ, రామానాయుడు, లావు శ్రీకృష్ణదేవరాయులు, కొల్లు రవీంద్ర,పత్తిపాటి పుల్లారావు, తంగిరాల సౌమ్య, అనగాని సత్యప్రసాద్, బిజెపి నుంచి జి.వి.ఎల్.నరసింహారావు, సుజనా చౌదరి, సిఎం రమేష్, సోము వీర్రాజు, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, సత్యకుమార్, జనసేన నుంచి కొణతల రామకృష్ణ, గాదె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మోడీకి ఘన స్వాగతం

చిలకలూరిపేట మండలం బొప్పూడి వద్దకు హెలికాప్టర్‌లో చేరుకున్న ప్రధాని మోడీకి పలువురు టిడిపి, బిజెపి,జనసేన నాయకులు ఘనస్వాగతం పలికారు. ప్రధాని ప్రయాణించే హెలికాప్టర్‌తోపాటు అదనంగా మరో రెండు హెలికాప్టర్లు వచ్చాయి. స్వాగతం పలికిన వారిలో చంద్రబాబు నాయుడు, పురందేశ్వరి,పవన్ కల్యాణ్ తదితరులున్నారు.

పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించండి

- పల్నాడులోని కొన్ని పరీక్షా కేంద్రాల్లో వెలుతురు లేదు, ఫ్యాన్లు లేవు
- కార్పొరేట్ విద్యాసంస్థలపై ఫిర్యాదులొస్తే కఠిన చర్యలు తీసుకోండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నేటి నుండి రాష్ట్ర వ్యాప్తంగా జరుగు 10వ తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో పల్నాడు జిల్లాలోని కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో విద్యా శాఖ అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారని, నాడు-నేడు పనులు అసంపూర్తిగా ఉన్న పాఠశాలల్లో కూడా పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారని ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి కోట సాయి కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశామని, పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని, పరీక్షా కేంద్రాలకు దగ్గరలో ఉన్న జిరాక్స్ సెంటర్ మూసి వేసేలా ఆదేశాలు జారీ చేశామని చెబుతున్న విద్యాశాఖాధికారులు విద్యార్థులకు పరీక్ష కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పనపై దృష్టి సారించలేదని ఆరోపణలు ఎస్ఎఫ్ఐ దృష్టికి వచ్చాయన్నారు. ఒకవైపు ప్రభుత్వం, మరోవైపు విద్యాశాఖ ఉన్నతాధికారులు పదవ తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పల్నాడు జిల్లాలో వెనుకబడిన ప్రాంతాల్లో నాడు-నేడు పనులు జరుగుతూ అసంపూర్తిగా ఉన్న పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించలేదన్నారు.

కొన్ని పరీక్షా కేంద్రాలలో ఫ్యాన్లు లేవని, ప్రస్తుత వేసవి కాలంలో ఫ్యాన్లు లేకుంటే విద్యార్థులు పరీక్షలు రాసే సమయంలో ఇబ్బంది పడే పరిస్థితి ఉంటుందన్నారు. వెలుతురు లేని పరీక్షా కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రతి పరీక్షా కేంద్రంలో ఫ్యాన్లు ఏర్పాట్లు చేయాలని, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని,ప్రతి పరీక్షా కేంద్రం దగ్గర మెడికల్ ఫస్ట్ ఎయిడ్ కిట్ ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ,మంచినీరు ఏర్పాటు చేయాలని అన్నారు. ఫీజు పేరుతో హాల్ టికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై ఏమైనా ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎటువంటి ఆందోళన లేకుండా ధైర్యంగా హాజరు కావాలని చెప్పారు. మంచి ఉత్తీర్ణత చాటి పదవ తరగతి ఫలితాలలో పల్నాడు జిల్లా సత్తా చాటాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రత్యూష

ఉచిత దంత వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

దంత సమస్యల పట్ల నిర్లక్ష్యం తగదని దంత వైద్యురాలు డాక్టర్ కొండా ప్రత్యూష అన్నారు. ఆదివారం అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో శివ శంకరరావు అధ్యక్షతన ఆరోగ్యసభ జరిగింది తొలుత నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో సుమారు 300 మందికిపైగా పాల్గొని దంత పరీక్షలు చేయించుకున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు. సభలో డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ దంతాలపై ఎనామిల్ పొర దెబ్బతినటం, దంతాలకు రంధ్రాలు ఏర్పడటం, చిగుళ్ల దెబ్బ తినటం వంటివి ప్రస్తుత దంత సమస్యలుగా ఉంటున్నాయని, బాగా పులుపుగా ఉన్న వస్తువులు తినటం, తాగటం వల్ల, బాగా వేడిగా ఉన్నవి తాగటం, దంతాలపై వత్తిడి పెట్టి శుభ్రం చేసే ప్రయత్నం వల్ల ఎనామిల్ పొర దెబ్బతింటుందని వివరించారు.

దంతాలను శుభ్రం చేసుకోవటానికి గట్టిగా గానీ, సున్నితంగా ఉన్న బ్రష్‌లు కాకుండా మీడియం అని ముద్రించి ఉన్న బ్రష్‌లు ఉపయోగించాలన్నారు. పళ్లకు గారపట్టటం వల్ల దంత సమస్యలు ఎక్కువగా వస్తాయని, ఆ గారను శుభ్రం చేయించుకుంటూ ఉండాలని, రోజుకు రెండుసార్లు బ్రష్ చేయాలని అన్నారు. నోటిలో లాలాజలం ఉత్పత్తి అవుతుందని, ఆ లాలాజలంలో మన ఆరోగ్యాన్ని పరిరక్షించే ఔషధగుణాలుంటాయని తెలిపారు. దంత వైద్యంలో కొత్త పద్ధతులు అందుబాటులోకి వచ్చాయని, అందులో ఒకటి ఇంప్లాంట్ వైద్యం అని అన్నారు. మొత్తం పళ్లు పోయినా అన్నింటినీ కొత్తగా ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు. కిళ్లీలు, వక్కపొడి తగ్గించాలన్నారు. అనంతరం డాక్టర్ ప్రత్యూషను సంస్థ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో చల్లా అంజిరెడ్డి, ఎవి.సాయిరాం పాల్గొన్నారు.

వైద్యారోగ్య రంగంలో పెరగనున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

- ప్రతిఒక్కరికీ వైద్యసేవలు అందించేలా ప్రణాళికలు
- ఆరోగ్య వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సుమిత శంకర్ అయ్యన్నార్
- ఎఎన్‌యులో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

వైద్యారోగ్య రంగంలో అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నాయని డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సుమిత శంకర్ అయ్యన్నార్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఎంబిఎ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం 'ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ ఆపర్చునిటీస్ ఇన్ హెల్త్ కేర్ మేనేజ్మెంట్' అంశంపై నిర్వహిస్తున్న మూడ్రోజుల అంతర్జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. సునీత శంకర్ అయ్యన్నార్ మాట్లాడుతూ ఆరోగ్య రంగం, వైద్యరంగం విస్తృతమయ్యాయని, ప్రతి ఒక్కరిలో ఆరోగ్యం పట్ల అవగాహన పెరుగుతోందని చెప్పారు. ప్రభుత్వం కూడా సామాన్యుడి దగ్గర నుంచి ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందించేలా సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. వైద్య రంగంలో ఆరోగ్య విశ్వవిద్యాలయం కీలకపాత్ర పోషిస్తోందన్నారు. మంగళగిరిలోని ఎయిమ్స్ ఆసుపత్రి పీడియాట్రిక్స్ విభాగాధిపతి, పరిశోధన డాక్టర్ వేపకొమ్మ దీప్తి మాట్లాడుతూ రోగి సంరక్షణ బాధ్యత పూర్తిగా ఆయా ఆసుపత్రులదేనన్నారు. రోగి ఆస్పత్రికి వచ్చినప్పుడు అంటువ్యాధులు నుండి సంరక్షణ ప్రమాదాల నివారణకు పేషెంట్ సేఫ్టీ నియమావళి పాటించాలని చెప్పారు. భోపాల్‌లోని ఎయిమ్స్ హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ హాస్పిటల్స్‌లో నాణ్యత ప్రమాణాలకు గుర్తింపు చాలా అవసరమని, తద్వారా మరింత నాణ్యమైన వైద్య సేవలు రోగులకు అందించవచ్చని చెప్పారు. ముంబైలోని హ్యూమన్ కేర్ వరల్డ్ సంస్థ నుంచి డాక్టర్ డిఎస్ చక్రవర్తి మాట్లాడుతూ వైద్య రంగంలో అనేక సవాళ్లతో కూడిన అవకాశాలున్నాయని, వైవిధ్యంగా, వినూత్నంగా ఆలోచించేవారికి ఈ రంగం అద్భుత ప్రగతిని అందించ గలరని వివరించారు. గుంటూరు జిజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ బిపి.కుమార్ మాట్లాడుతూ నేడు ప్రభుత్వ రంగ ఆసుపత్రులు కూడా అక్రిడిడేషన్‌కు వెళ్లి వారి నాణ్యత ప్రమాణాలను, మెరుగైన వైద్య సేవలను అందించేందుకు గుర్తింపును తీసుకుంటున్నాయని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వైద్యరంగంలో వస్తున్న మార్పులను, సవాళ్లను, బ్లూ ఓషన్ టెక్నాలజీ వినియోగాన్ని కెఎల్ యూనివర్సిటీ అంతర్జాతీయ సంబంధాల కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.కిషోర్‌బాబు వివరించారు. సదస్సుకు దేశ నలుమూలల నుండి అనేక పరిశోధన పత్రాలు వచ్చా యని సదస్సు డైరెక్టర్ డాక్టర్ బట్టు నాగ రాజు తెలిపారు. అనంతరం సర్టి ఫికెట్లను గాంధీ అధ్యయన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె.సోమశేఖర్ ప్రదానం చేశారు. విభాగం అధ్యాపకులు డాక్టర్ పి.శ్రీనివాస్, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ సాదిక్ అహ్మద్, డాక్టర్ డేవిడ్‌రాజు, డాక్టర్ చుండి ప్రసాద్ పాల్గొన్నారు.

మార్చి నుండే మండుతున్న ఎండలు

- బయటకు రావాలంటే భయపడుతున్న ప్రజలు
- ఏప్రిల్, మేలో ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరుగుతాయని అంచనా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఈ ఏడాది ఈ నెల ఆరంభం నుండి ఎండలు మండుతున్నాయి. ఎండల తీవ్రత ఎక్కువగా ఉడడంతో కొన్ని రోజుల నుండి ఉదయం 10 గంటల తర్వాత ప్రజలు రోడ్లపైకి రావడానికి భయపడే పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు ఎండల తీవ్రత తాళలేక అస్వస్థతకు గురవుతున్నారు. నరసరావుపేట పట్టణంలో ఎండ తీవ్రత ఎక్కువుగా ఉంటున్న నేపథ్యంలో మధ్యాహ్నం రోడ్డు మార్గాలు నిర్మానుష్యంగా ఉంటున్నాయి. పాఠశాల విద్యార్థులు ఉక్క పోతకు తాళలేకపోతున్నారు. మరో వైపు ఇంటర్మీడియట్ విద్యార్థులు పరీక్షలకి వెళ్లి వస్తున్న క్రమంలో ఎండల కారణంగా ఇబ్బందులకు గురవుతున్నారు. 12 గంటల సమయం అయ్యిందంటే ప్రజలంతా ఇండ్లకే పరిమితం అవుతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఉదయాన్నే ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వెళ్లేందుకు ప్రణాళిక రూపొందించుకొని ప్రయాణిస్తున్నారు. ఎండ తీవ్రత పెరగక ముందే వృద్ధులు పిల్లలు ప్రయాణాలు చేయడం ఉత్తమం. మంచినీటిని విరివిగా తీసుకోవాలని ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత మరింత పెరగనున్నట్లు జిల్లా అధికారులు అంచనాలు వేస్తున్నారు. రోజు రోజుకు పెరుగుతున్న ఎండల కార ణంగా, ఉపశమన చర్యల్లో భాగంగా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలలో ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 18 వ తేదీ నుండి 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ప్రజలు ఎండల తీవ్రత నుండి ఉపశమనం పొందేందుకు చెరుకురసం, శీతల పానీయాలు, కొబ్బరి బోండాలు, పండ్ల రసాలు సేవిస్తూ పుచ్చకాయలు తింటూ ఎండ తీవ్రత నుండి కొంత ఉప శమనం పొందుతున్నారు.

ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

డాక్టర్ నెల్లూరి రమేష్

నెల్లూరి హాస్పిటల్, నరసరావుపేట

ఎండ తీవ్రతను తట్టుకునేందుకు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. రానున్న ఎండల తీవ్రత నుండి ఉపశమనం పొందేందుకు మంచి నీరు ఎక్కువుగా తీసుకోవాలి. వృద్ధులు, పిల్లలు ఉదయం, సాయంత్రం సమయాల్లో మాత్రమే బయ టకు రావడం ఉత్తమం. ద్విచక్రవాహనంపై ప్రయాణం చేసే వారు తలకు ఎండ తగలకుండా ముక్కు చెవుల్లోకి గాలి పోకుండా మెత్తటి తువ్వాలు చుట్టుకోవడం శ్రేయస్కరం. నిమ్మ రసం, కొబ్బరినీళ్లు, ద్రాక్ష, ఆరంజ్ పండ్లతో పాటు రోజుకు కనీసం 5 నుండి 6 లీటర్ల మంచినీరు తాగాలి.ఇలా చేయడం ద్వారా శరీరంలో మినరల్స్ స్థాయిలు తగ్గకుండా చేస్తుంది. ఫ్రిడ్జ్ నీటికి, శీతల పానీయాలకు దూరంగా ఉండాలి. నల్లటి బట్టలు కాకుండా లూజుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి. ఎండదెబ్బ తగిలితే తల తిరగడం అలసట, విరోచనాలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. అటువంటి లక్షణాలు ఉన్న వ్యక్తిని వెంటనే నీడలో కూర్చోబెట్టి శరీరమంతా తడిగుడ్డతో తుడవాలి. వైద్యున్ని సంప్రదించి చికిత్స పొందాలి.

మహారాజశ్రీ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పిడుగురాళ్ళ వారి కోర్టులో,
ఒ.యస్. నెం.256/2022

మధ్య
నారా సరోజిని ...వాది
మరియు
1. దప్పిలి చిన్న నారాయణ రెడ్డి వగైరాలు ...ప్రతివాదులు

6వ ప్రతివాది,
నలమాల వెంకట కృష్ణారావు, తండ్రి శ్రీనివాసరావు,
వయస్సు 32 సం॥లు, నివాసము డోర్ నెం.11-13-662, రామిరెడ్డిపేట, పాత పోస్టాఫీస్ వద్ద, నర్సరావుపేట, పల్నాడు జిల్లా.

పై నెంబరు దావాలో వాది పంపిణీ మరియు ఇతర పరిహారముల నిమిత్తము మీ పైన మరియు ఇతర ప్రతివాదుల పైన దావా చేసియున్నారు. సదరు దావాలో ది. **22-03-2024**వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు తేదీన మీరు స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని **ఉదయం 10-30 గం॥కు** కోర్టులో హాజరై మీ అక్షేపణలు తెలుపవలసియున్నది. లేనిచో మీ పరోక్ష మందున తీర్మానించబడును.

కోర్టువారి ఉత్తర్వుల మేరకు
వాయిదా తేది.22-03-2024
పిడుగురాళ్ళ

వాది తరపు న్యాయవాదులు
చల్లా రామిరెడ్డి,
మాదాసు వెంకటేశ్వర రావు
సెల్ నెం. **94414 09796**

షర్మిల నాయకత్వంలో 'వరికిపూడిశెల' కోసం పాదయాత్ర

నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి అట్లూరి విజయ్ కుమార్

ప్రజాశక్తి-వినుకొండ

వరికపూడిశెల ప్రాజెక్టు సాధన కోసం రాష్ట్ర పిసిసి అధ్యక్షులు వైయస్ షర్మిల నాయకత్వంలో బొల్లాపల్లి నుండి అమరావతి వరకు ప్రాజెక్టు పూర్తి చేయాలి అనే నినాదంతో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేయనున్నట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పట్టుకొని విజయ కుమార్ తెలిపారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. విజయకుమార్ మాట్లాడుతూ విశాఖపట్నం న్యాయసభకు ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి తెలుగు రాష్ట్రాల వారందరూ ఒకటిగా ముందు కెళదామని ప్రకటించడం సంతోషకరమన్నారు. బొల్లాపల్లి మండలంలో ప్రతి పేద కుటుంబాన్ని పలకరిస్తూ వరికపూడిశెల ప్రాజెక్టు కింద ఉన్న గ్రామాలన్నింటిని పర్యటించి రైతు కూలీలను ఏకం చేసుకుని ప్రాజెక్టు నిర్మాణానికి పోరాటం చేసే ప్రతి ఒక్కరిని కలుపుకొని 'చలో అమరావతి' చేపడతామన్నారు. ప్రత్యేక హోదా కోసం కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అబద్ధపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రజలకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్ర రూపం దాల్చిందని,ఎలక్షన్ ముందు దగా డిఎస్సీ పెట్టి మోసం చేశారని అన్నారు. విశాఖ స్టీల్ ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేసే బిజెపి ప్రభుత్వం కుట్రను వైసిపి, టిడిపిలు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు.వైసిపితో పాటు టిడిపి,జనసేన, బిజెపిలను ప్రజలు తిప్పికొట్టాలని అన్నారు. కార్యక్రమంలో బిసి రాష్ట్ర నాయకులు భత్తుల శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్. నాగూర్ భాషా, మైనారిటీ నాయకులు షేక్ బాజీ పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

చదువుతోనే మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి-ఈపూరు

విద్యార్థులకు చదువుతూనే మంచి భవిష్యత్తు లభిస్తుందని చిలకలూరిపేట ఎపి ఎన్జీవో అధ్యక్షులు బి.హనుమంతు నాయక్ అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు లో బిసి, ఎస్సి,ఎస్టి, కేజీబీవీ విద్యార్థులకు చిత్ర కేర్ చారిటబుల్ ట్రస్ట్ వారు పరీక్ష సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ డి.కావేరి మాట్లాడుతూ చదువులో రాణించడం ద్వారా పేదరికం జయించవచ్చని చెప్పారు. సమయాన్ని వథా చేయకుండా 10 పరీక్షలలో మంచి ఫలితాలు సాధించాలన్నారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామని అన్నారు. అనంతరం 67 మంది విద్యార్థినీవిద్యార్థులకు పరీక్ష సామాగ్రిని ట్రస్ట్ సభ్యులు పంపిణీ చేశారు. అలాగే, గత ఏడాది పదవ తరగతి పరీక్షల్లో 569 మార్కులు సాధించిన విద్యార్థిని బి.రమ్యకు రూ.5 వేలు, 490 మార్కులు సాధించిన విద్యార్థి వి.అజయ్ కుమార్‌కు రూ.3 వేలు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి భూక్యా వెంకటేశ్వర్లు నాయక్, ఎపి ఎన్జీవో ఉపాధ్యక్షులు డి.దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

పంటలు ఎండిపోయిన రైతులకు

నష్టపరిహారం చెల్లించండి

- **కొనుగోలు కేంద్రాల ద్వారా మొక్కజొన్న, శనగలను మద్దతు ధరకు కొనుగోలు చేయాలి : రైతు సంఘం**

మిర్చి పంటను కాపాడుకునేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని తరలిస్తున్న రైతులు (ఫైల్)

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వర్షాభావ పరిస్థితుల మూలంగా మిర్చి, మొక్కజొన్న, పత్తి, వరి తదితర పంటలు వేసి నీరు వర్షాలు లేక పంట ఎండిపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాల రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కోటప్పకొండ రోడ్డులోని ప్రజా సంఘాల కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచ మానవాళికి ఆహారాన్ని అందించే రైతుల పరిస్థితి రోజురోజుకు మరింత దయనీయంగా మారుతోందని రైతాంగ స్థితిగతుల్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు తీసుకోకపోగా వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరణ చేసేందుకు కుట్రలు పన్నడం రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు గంగిరెద్దులా తల ఊపడం సరికాదన్నారు. రోజురోజుకీ జనాభా పెరగడం ఆహార భద్రతపై ప్రభుత్వాలు దృష్టి సారించాలన్నారు. రైతులు బలోపేతం అయితేనే దేశ ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తుందన్నారు. గత ఖరీఫ్‌లో ఆరుతడి పంటలకు నీరు ఇస్తామని ఆరుతడి పంటలే సాగు చేసుకోవాలన్న ప్రభుత్వ ప్రకటనతో ఆయా పంటలు సాగు చేసిన రైతులు నిండా మునిగిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాక్టర్‌తో ట్యాంకర్ల ద్వారా అందుబాటులో ఉన్న అరకొర నీటి వనరులు ఒడిసి పట్టి మిర్చి పంటను సాగు చేస్తే తామర, బొబ్బర తెగుళ్ల పట్టి రైతులను నిరాశ పరిచాయన్నారు. మిచాంగ్ తుఫాను నేపథ్యంలో రైతులు సాగు చేసిన అపరాల పంటలు దెబ్బతిన్నాయని, 2023-24 ఏడాది రైతులకు ఏ మాత్రం కలిసి రాలేదని, నిబంధనలు పక్కన బెట్టి నష్టపోయిన ప్రతి రైతుకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రస్తుతం శనగ, మొక్కజొన్న నూర్పిడికి వచ్చిన నేపథ్యంలో మార్కెట్ యార్డ్ కమిటీల ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తీవ్ర వర్షాభావ పరి స్థితుల నేపథ్యంలో భూగర్భ జలాలు అడుగంటిపోయి వినుకొండ, బొల్లాపల్లి, దుర్గి, కారంపూడి తదితర ప్రాంతాల్లో బోర్లు ఎండిపోవడంతో నీళ్లు రాక సాగు చేసిన పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాగార్జున సాగర్ ఆయ కట్టు కింద రైతులు లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి బోర్లు బావులు ఏర్పాటు చేసినా నీళ్లు రాక వేసిన పంటలు ఎండి పోయాయని, పల్నాడు జిల్లాలో 1.70 లక్షల ఎకరాలలో మిర్చి చేసి నష్ట పోయారని తెలిపారు. రైతులు ఎకరా మిర్చికి రూ 1.50 లక్షల నుండి రూ 2 లక్షలు, మొక్కజొన్నకు రూ.35 నుండి రూ .40 వేలు, శనగకు రూ.15 వేలు నుండి రూ.20 వేల వరకు పెట్టుబడులు పెట్టి పంట సాగు చేశారని, పంట చేతికొచ్చే సమయంలో నీళ్లు లేక ఎండిపోవడంతో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా తీరే పరిస్థితి లేక పోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి దాపురించిందని పేర్కొన్నారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు.. ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం అంచనా వేసి తక్షణ సాయంగా ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని, కరువు మండలాలను ప్రకటించి, సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనం నుండి పంట అమ్మకం (సీడ్ టూ సేల్) అనే రాష్ట్ర ప్రభుత్వ ప్రకటన కేవలం ప్రకటనకే పరిమితమైందని తెలిపారు. ప్రస్తుతం శనగ,మొక్కజొన్న నూర్పిడికి వచ్చిన నేపథ్యంలో మార్కెట్ యార్డ్ ల ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న ఖరీఫ్ సీజన్ నాటికైనా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సిన నాణ్యమైన విత్తనాలు,ఎరువులు,పురుగు మందులు రాయితీపై అందించాలని, నకిలీ విత్తనాలు, పురుగు మందుల నివారణకు అడ్డుకట్ట వేయాలని సూచించారు.

కార్మికుల అభ్యున్నతికి పెదరాజారావు కృషి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పెదరాజారావు సంతాప సభలో మాట్లాడుతున్న వై.రాధాకృష్ణ

ఐఎల్‌టిడి, ఇతర కంపెనీలలో కార్మికుల కోసం, వారి అభివృద్ధి కోసం కృషి చేసిన వ్యక్తుల్లో సాతులూరి పెద రాజారావు ముఖ్యులని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.రాధాకృష్ణ అన్నారు. స్థానిక తూర్పు మాలపల్లెలో చంద్రమౌళి పార్కులో ఆదివారం సంతాప సభ జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఎం పట్టణ కమిటీ కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. రాధాకృష్ణ మాట్లాడుతూ రాజారావు ఆశయాలకు అను గుణంగా నడవాలన్నారు. రాష్ట్రంలో, దేశంలో ఐక్య పోరాటాలు విజయాలు సాధించాయని అన్నారు. సిఎఎ నిబంధనలు చూస్తే కేవలం ముస్లింలకు పౌరసత్వాన్ని కల్పించమని చెబుతున్నారని, ఒక మతం వారిపై మరో మతం వారితో విద్వేషాలను, భావోద్వేగాన్ని రెచ్చ గొట్టడమేనని అన్నారు. మత సామరస్యాన్ని కాపాడుకోవాల్సి అవసరం ఉందని, ఈపని కేవలం ఒక్క సిపిఎం చేస్తోందని చెప్పారు. రాష్ట్రాల హక్కులను కాపాడు కోవాల్సిన అవసరం ఉంద న్నారు. అనంతరం యడ్లపాడు మండల రైతు నాయకులు కారుచోళ రోశయ్య,పెదనండిపాడు మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్, సిపిఎం సీనియర్ నాయకులు పోపూరి సుబ్బారావు రాజారావు చేసిన ఉద్యమాలు, ఆయన నిబద్ధత గురించి మాట్లాడారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసరెడ్డి, హరిబాబు,పీటర్,పద్మారావు, శంకరావు, టి.ప్రతాపరెడ్డి, సాతులూరి లూథర్, సాతు లూరి బాబు, పార్టీ సానుభూతి పరులు,అభిమా నులు, రాజారావు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

షేక్ మస్తాన్ బి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం అభిమాని షేక్ మస్తాన్‌బి మృతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం ఫణిదం సిపిఎం సీనియర్ నాయకులు షేక్ హుస్సేన్ సా భార్య, పార్టీ సానుభూతి పరురాలు షేక్ మస్తాన్ బి అనారోగ్య కారణంతో మృతి చెందారు.. ఈ విషయం తెలుసుకున్న సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ ఆమె భౌతిక కాయాన్ని ఆదివారం సందర్శించి నివాళులర్పించారు విజయ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామంలో మహిళా సంఘం నిర్మాణంలో మస్తాన్ బి ప్రముఖ పాత్ర పోషించారని చెప్పారు. మహిళలపై జరిగే దాడులకు వ్యతిరేకంగా గ్రామంలో మహిళలను ఐక్యం చేశారని, అనేక కూలి పోరాటాల్లో కూడా పాల్గొన్నారని అన్నారు. మస్తాన్ బి భర్త షేక్ హుస్సేన్ సా గ్రామ పార్టీ సభ్యుల్లో ప్రముఖులని, భార్యాభర్తలు నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడ్డారని అన్నారు. మహిళా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు గద్దె ఉమశ్రీ మాట్లాడుతూ షేక్ మస్తాన్ బి మహిళా సంఘంలో చాలా చురుగ్గా పనిచేసేవారని, గ్రామంలో సంఘ నిర్మాణానికి ఎంతగానో కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజిని, సిఐటియు సత్తెనపల్లి పట్టణ కార్యదర్శి హరి పోతురాజు, గ్రామ పార్టీ నాయకులు ఆర్.పూర్ణచంద్రరావు, కె.వెంకటేశ్వర్లు, గ్రామ పార్టీ శాఖ కార్యదర్శి వి.తులసీరామ్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సమీక్షలో పాల్గొన్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుండి ఆదివారం ఎన్నికల సంసిద్ధత, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్ష నిర్వహించారు. నరసరావుపేట కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఈ సమీక్షకులో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎల్.శివశంకర్, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల అధికారులతో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్ని కల కోసం అన్ని విధాలా సంసిద్ధత ఎంతో కీలకమైందన్నారు. జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కాండెక్ట్ (ఎంసిసి) అమలుపై ఎన్నికల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎంసిసి, ఎఫ్ఎస్‌టి టీమ్‌లు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలన్నారు. సీవిజిల్ యాప్‌ను మరింత బలోపేతం చేయాలని, ఈ యాప్ నుంచి వచ్చే ఫిర్యా దులను 100 నిమిషాలలో పరిష్కరించేలా చర్యలు తీసు కోవాలన్నారు. రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో వాలం టీర్లు పాల్గొంటే వారిని సస్పెండ్ చేయాలని ఆదేశించారు.

వైద్య విద్యార్థినికి రూ.25 వేలు సాయం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పేద వైద్య విద్యార్థినికి నరసరావుపేట బొల్లు రాజేశ్వరి కృష్ణారావు ఛారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని ట్రస్ట్ వ్యవస్థాపకులు బొల్లు వెంకట కృష్ణారావు ఆదివారం విద్యార్థిని తండ్రి కానుగుల కోటేశ్వర రావుకు అంద జేశారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లకి చెందిన కానుగుల పూజిత వైద్య విద్యలో ప్రతిభ చాటి ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మొదటి ఏడాది విద్య నభ్యసిస్తున్నారు. ఈ క్రమం లో ఛారి టబుల్ ట్రస్ట్ సభ్యులను ఆర్థిక సహాయం కోరగా అంద జేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు కృష్ణారావు మాట్లాడారు.

తెనాలి నియోజకవర్గంలో రసవత్తర పోటీ

- వైసిపి నుంచి వరుసగా మూడోసారి సిద్ధమైన శివకుమార్
- ఐదోసారి బరిలో నాదెండ్ల మనోహర్

ప్రచారంలో నాదెండ్ల మనోహర్, ఆలపాటి రాజేంద్రప్రసాద్ పెమ్మసాని చంద్రశేఖర్

షర్మిల సభలో డాక్టర్ చందు సాంబశివుడు

ఎన్నికల శంఖారావం పూరించిన శివకుమార్

ప్రజాశక్తి-తెనాలి

సార్వత్రిక ఎన్నికలంటే తెనాలికి ప్రత్యేక స్థానం, ఇక్కడి ఫలితంపైనే సర్వత్రా ఉత్కంఠ ఉంటుంది. ప్రతిసారి తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థుల ఎంపికలో కూడా చివరి వరకూ ఉత్కంఠత కొనసాగేది. అయితే ఈ దఫా అందుకు భిన్నంగా ఎన్నికల కోడ్ కంటే ముందే అభ్యర్థులను కూడా ప్రధాన పార్టీలు ఖరారు చేశాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వైసిపి నుంచి తిరిగి సీటు దక్కించుకోగా, టిడిపి, జనసేన, బిజెపి కూటమి నుంచి జనసేన పార్టీ నాయకులు నాదెండ్ల మనోహర్ సీటు దక్కించుకున్నారు. అంతే కాకుండా ఇదే కూటమి నుంచి గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గానికి పోటీ చేస్తున్న అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కూడా ఇదే నియోజకవర్గం వారే. మే 13న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తెనాలి నియోజకవర్గ ముఖచిత్రం, పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థుల వివరాలు..

తెనాలి అసెంబ్లీ నియోజకవర్గంలో తెనాలి, కొల్లిపర రెండు మండలాలున్నాయి. కొల్లిపర మండలంలో 20 గ్రామాలుండగా, తెనాలి మండలంలో 18 గ్రామాలున్నాయి. తాజాగా ఓటర్ల జాబితా సవరణ అనంతరం అధికారులు వెల్లడించిన గణాంకాల ప్రకారం నియోజకవర్గంలో మొత్తం 2,64,894 మంది ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 1,27,603 మంది, స్త్రీలు 1,36,795 మంది ఉన్నారు. ఎన్ఆర్ఐలు 170 మంది, త్రివిధ దళాల్లో పనిచేస్తున్న 288 మంది, ట్రాన్స్ జెండర్స్ 44 మంది ఓటర్లుగా ఉన్నారు. తెనాలి పట్టణం, రూరల్, కొల్లిపర మండలం విడివిడిగా ఓటర్లను పరిశీలిస్తే తెనాలి పట్టణంలో 1,55,063 మంది ఓటర్లుండగా వీరిలో 74,584 మంది పురుషులు, 80,446 మహిళలు ఉన్నారు. తెనాలి రూరల్ మండలంలో పురుషులు 64,666 ఓటర్లుండగా వారిలో పురుషులు 31,301, మహిళలు 33,361 మంది, కొల్లిపర మండలంలో 44.707 మంది ఓటర్లుండగా వారిలో మహిళలు 22,988, పురుషులు 21,718 ఉన్నారు.

వైసిపి తరుపున ఎమ్మెల్యే అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పోటీలో ఉన్నారు. ఆయన వైసిపి నుంచి పోటీ చేయటం ఇది మూడోసారి. 2014లో ఓడిపోయారు. తిరిగి 2019లో గెలిచి, ఇపుడు తాజాగా మరలా పోటీ చేస్తున్నారు. గతనెల 26న ఎన్నికల శంఖారావం పూరించారు. టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ తెనాలి నుంచి పోటీ చేయటం ఇది ఐదోసారి. గతంలో 2004, 2009 నుంచి కాంగ్రెస్ నుంచి గెలిచారు. ఉమ్మడి రాష్ట్రం అసెంబ్లీ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ వంటి పదవులను అలంకరించారు. రాష్ట్ర విభజన తరువాత 2014లో అదే కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడియారు. తదుపరి జనసేర పార్టీలో చేరి 2019 ఎన్నికల్లో పోటీ చేసి, మరలా ఓటమి పాలయ్యారు. తాజాగా ఐదోసారి జనసేన, టిడిపి, బిజెపి ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. పొత్తులకు ముందే తెనాలి సీటును మనోహర్‌కు ప్రకటించినా, పొత్తుల తరువాత టిక్కెట్ మాజీ మంత్రి ఆలపాటికి దక్కుతుందా? నాదెండ్ల మనోహర్‌కు దక్కుతుందా? అనే సందేహాలకు తెరదించుతూ ఉమ్మడి అభ్యర్థిగా నాదెండ్ల మనోహర్‌ను ఆ పార్టీ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలతో తొలుత ఆలపాటి కొంత నిరాశకు గురైనా టిడిపి అధినేత చంద్రబాబునాయుడు స్వయంగా మాట్లాడటంతో సర్ధుకుని మనోహర్‌కు మద్దతు తెలిపారు. దీనికితోడు గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ కూడా నియోజకవర్గంలోని బుర్రిపాలెం గ్రామానికి చెందిన వారు కావటం ప్రత్యేకతను సంతరించుకుంది. మనోహర్, రాజేంద్రప్రసాద్, డాక్టర్ చంద్రశేఖర్ కలిసి ఉమ్మడి ప్రచారానికి తెరతీశారు.

అన్నాబత్తుని శివకుమార్, నాదెండ్ల మనోహర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా ఇక్కడ పోటీలో ఉంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీచేసిన డాక్టర్ చందు సాంబశివుడు ఇదే స్థానం నుంచి తిరిగి పోటీ చేసే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు వైఎస్ షర్మిల నియోజకవర్గంలోని కొలకలూరు పర్యటనను కూడా ఆయన విజయవంతం చేశారు. షర్మిల పర్యటనలో కాంగ్రెస్ కురువృద్ధులు పాల్గొనడం, ప్రత్యేక హోదా నినాదం, 'ఇండియా' కూటమి తదితరాల నేపథ్యంలో ఆ పార్టీ ప్రభావమూ ఎన్నికల్లో ఉంటుందనే భావన నెలకొంది. ఎన్నికలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైన నేపథ్యంలో ఆయా పార్టీల అభ్యర్థుల వ్యూహ ప్రతివ్యూహాలు ఎలా ఉంటాయన్నది వేచి చూడాల్సిందే.

ఎన్నికల కోడ్‌ను కట్టుదిట్టంగా అమలు చేయాలి

మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

సాధారణ ఎన్నిల షెడ్యూల్ శనివారం జారీ అయిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఆదివారం రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈ కాన్ఫరెన్స్‌లో గుంటూరు కలక్టరేట్ నుండి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, నగర కమిషనర్ కీర్తి చేకూరి, డిఆర్ఓ పెద్దిరోజా పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ శాసనసభ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి ఫొటోలతో కూడిన ప్రభుత్వ ప్రకటనలు, అన్ని రకాల వాల్ రైటింగులు, పోస్టర్లు, కటౌట్లు, హెూర్డింగులు, బ్యానర్లు, జెండాలు వంటివన్ని తొలగించి ఆదివారం సాయంత్రానికి కలెక్టర్ కార్యాలయానికి నివేదిక ఇవ్వాలన్నారు.టెలీ కాన్ఫరెన్స్ అనంతరం కలక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ పరిశీలించి విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి తగు సూచనలు చేశారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్ఓ) కీర్తి చేకూరి స్పష్టం చేశారు. ఆదివారం నగరపాలక సంస్థ ఎన్నికల విభాగాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన సమయంలో విధుల్లో లేని సూపరిండెంట్ పద్మకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని మేనేజర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వచ్చినందున ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనల మేరకు ప్రభుత్వ ఉద్యోగులు ఎటువంటి రాజకీయ పార్టీల ర్యాలీల్లో, ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకూడదని, ఎక్కడైనా పాల్గొన్నట్లు నిరూపణైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే నగరంలో వార్డు సచివాలయాల్లో ముఖ్యమంత్రి, రాజకీయ నాయకుల ఫొటోలు, ప్రభుత్వ పథకాల సూచిక బోర్డులు, పోస్టర్స్, ఫ్లెక్సీలు పూర్తి స్థాయిలో తొలగించాలని నోడల్ అధికారులకు, అడ్మిన్ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. నగరంలో ప్రభుత్వ భవనాలు, జంక్షన్‌లు, జిఎంసి స్థలాల్లో ఏర్పాటు చేసిన పోస్టర్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లను యుద్ధ ప్రాతిపదికన తొలగించారని చెప్పారు.

జిఎంసి ఎన్నికల విభాగాన్ని సందర్శించిన కమిషనర్

కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయొచ్చు : గుంటూరు కమిషనర్

సార్వత్రిక ఎన్నికల ప్రవర్తన నియమావళి శనివారం నుండే అమలులో ఉన్నందున నగరంలో రాజకీయ పార్టీల పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు తొలగిస్తున్నామని, ఇంకా ఏమైనా ఎంసిసికి సంబంధించి ఫిర్యాదులు ఉంటే జిఎంసిలో ఏర్పాటు చేసిన కంప్లైంట్ సెల్ 9849908391 నంబర్‌కు కాల్ చేయాలని లేదా వాట్సప్ చేయవచ్చని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్ఓ) కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ మేరకు నగరంలోని ప్రభుత్వ ఆస్తులపై అన్ని రకాల వాల్ రైటింగులు, పోస్టర్లు, కటౌట్లు, హెూర్డింగులు, బ్యానర్లు, జెండాలను నగరపాలక సిబ్బంది తొలగిస్తున్నారని, బహిరంగ ప్రదేశాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రైల్వే, రోడ్డు వంతెనలు, ప్రభుత్వ బస్సులు, విద్యుత్ స్తంభాలు, మున్సిపల్ సమావేశ ప్రదేశాల్లోని అన్ని రకాల రాజకీయపరమైన అడ్వర్టైజ్‌మెంట్లు, వాల్ రైటింగులు, పోస్టర్లు, కటౌట్లు అన్నింటినీ శనివారం నుండి తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు.

మోకాళ్లపై పంచాయతీ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - ఫిరంగిపురం

తమకు 9 నెలలుగా రావాల్సిన జీతాలను సత్వరమే ఇవ్వాలని కోరుతూ మండల కేంద్రమైన ఫిరంగిపురం పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె 7వ రోజుకు చేరింది. ఆదివారం శిబిరం కార్మికులు మోకాళ్లపై నిల్చుని దోసిలి చూపుతూ నిరసన వ్యక్తం చేశారు. ఓర్సు బాలయ్య, శ్రవణ్, పుల్లయ్య, ప్రభుదాస్, ఇబ్రహీం పాల్గొన్నారు.

కార్మికులకు మద్దతు తెలుపుతున్న సిపిఎం, సిఐటియు నాయకులు

ఎసిసి సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులకు సిపిఎం, సిఐటియు మద్దతు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఎసిసి సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులకు సిపిఎం, సిఐటియు తన సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని సిపిఎం నాయకులు జొన్నా శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, సిఐటియు తాడేపల్లి కార్యదర్శి వేముల దుర్గారావు తెలిపారు. ఆదివారం సిమెంటు ఫ్యాక్టరీ యూనియన్ కార్యాలయం వద్ద జరిగిన కార్మిక కుటుంబాలు జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికులు ఐక్యంగా ఉండి పోరాడితేనే సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఓట్ల కోసం ఇంటి ముందుకు వచ్చే వారిని నిలదీయాలని సూచించారు. కోర్టు తీర్పు ఇచ్చినా తమ సమస్య పరిష్కారం కాలేదని, కార్మికుల సమస్య పరిష్కరిస్తేనే ఓట్లు వేస్తామని ఆయా రాజకీయ పార్టీల నాయకులకు స్పష్టం చేయాలన్నారు. ఏళ్ల తరబడి సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడంతో కార్మికులందరూ చెట్టుకొకరు పుట్టకొకరు అయ్యారని యూనియన్ కార్యదర్శి కూరపాటి స్టీవెన్ తెలిపారు. కార్మికులకు రావాల్సిన బాకాయిలు చెల్లించాలని కోర్టు తీర్పు ఇచ్చినా ప్రభుత్వ అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

రాజధాని గ్రామాల్లో పోలీసు కవాతు

ప్రజాశక్తి - తుళ్లూరు

ఎన్నికల నేపథ్యంలో రాజధాని గ్రామాల్లో ఆదివారం పోలీస్ కవాతు నిర్వహించారు. లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం, తాళ్లాయపాలెం, వెంకటపాలెం గ్రామాల్లో పోలీసులు కవాతు జరిపారు. సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్స్ (సిఎపిఎఫ్), స్థానిక పోలీసులు ఉదయం గం.9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించారు. ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని సిఐ షేక్ సుభాని కోరారు.

ఉద్దండరాయునిపాలెంలో

విద్యార్థినులకు మార్క్స్ మెమోలు అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాల్లో

'కృష్ణవేణి' విద్యార్థులకు అత్యధిక మార్కులు

ప్రజాశక్తి - నరసరావుపేట

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ శనివారం విడుదల చేసిన 1వ సెమిస్టర్ డిగ్రీ ఫలితాల్లో నరసరావుపేటలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్పులు సాధించిన పి.వెంకటస్వాతి, సిహెచ్. గాయత్రి, ఎ.మాధవి, ఎడి రాఘవులు, ఇతర విద్యార్థులకు మెమోలు అందజేశారు. ఈ పరీక్షా ఫలితాలు అన్ని గ్రూపులలో మార్పులు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ కె. నాసరయ్య, డి. మేఘేశ్వరరావు అభినందించారు.

కళాశాల 19వ వార్షికోత్సవం

కృష్ణవేణి డిగ్రీ కళాశాల 19వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపల్ నాతాని. వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేడుకలో విద్యా ర్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రతి విద్యార్థి ఒక సంకల్పం, లక్ష్యంతో ముందుకు సాగాలని ప్రిన్సిపల్ సూచించారు. అబివృద్ధి చెందుతున్న భారతదేశంలో నూతన ఆవిష్కరణలతో దేశానికి ఉపయోగపడేలా నడవాలని విద్యార్థులకు సూచించారు. పట్టభద్రులైన ప్రతి విద్యార్థి ఒక నిర్దిష్టమైన లక్ష్యం ఏర్పరచుకొని ఆ లక్ష్యం వైపు నడుస్తూ దేశానికి కుటుంబానికి ఉపయోగపడే విధంగా ఉండాలని విద్యార్థులను కోరారు. ముఖ్యఅతిథులుగా అవెం టల్ లిమి టెడ్ కంపెనీ సెక్రటరీ డి. రాజశేఖర్‌రెడ్డి, కేరిడ్జ్ ఇంట ర్నేషనల్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. మల్లేశ్వరి పాల్గొన్నారు.

వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా మట్టారెడ్డి

ప్రజాశక్తి- రెంటచింతల

పల్నాడు జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శిగా చల్లా మట్టారెడ్డిని నియమిస్తూ జిల్లా అధ్యక్షులు మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు మండలంలోని పసర్లపాడుకి చెందిన సీనియర్ నేత మట్టారెడ్డి. గతంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా, సత్రశాల దేవాలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్ గా పనిచేశారు ఈ సందర్భంగా మట్టారెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి కారకులైన పిన్నెల్లి సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు మట్టారెడ్డి నియామకంపై హర్షం వ్యక్తం చేసిన వారిలో మాజీ సర్పంచ్ వెన్న లింగారెడ్డి, మైనార్టీ నేత సైదా ఉన్నారు.

'విలేకరులకు రక్షణ కల్పించండి'

ప్రజాశక్తి - రెంటచింతల

మే 13న జరగనున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో నిష్పక్షపాతంగా వార్తలు రాస్తున్న విలేకరులకు రక్షణ కల్పించాలని, అప్పుడే క్షేత్రస్థాయిలో అక్రమాలు వెలుగు లోకి వస్తాయని సిపిఐ మండల కార్యదర్శి రంగనాయకులు అబిప్రాయపడ్డారు మండల కేంద్రమైన రెంటచింతలలోని ఆదివారం షాది ఖానాలో ప్రెస్ క్లబ్ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రంగనాయకులు మాట్లాడుతూ సమాజ హితం కోసం కృషి చేస్తున్న విలేకరులపై దాడులు చేయడం బాధాకరమన్నారు

పిడుగురాళ్లలో..

మాచర్లలో..

సత్తెనపల్లిలో..

ఎన్నికల కోడ్ అమలు.. విగ్రహాలకు ముసుగులు..

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

ఎన్నికల కోడ్ శనివారం సాయంత్రం నుండి అమలు కావడంతో పిడుగురాళ్ల పట్టణ, మండల ప్రాంతాల్లోని రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీల తొలగింపునకు మున్సిపల్, మండల పరిషత్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పట్టణ,ఆయా గ్రామాల్లోని రాజకీయ నాయకుల విగ్రహాల ముఖాలు కనపడకుండా తెల్లగుడ్డలతో కట్టేశారు. అంతేకాకుండా ప్రభుత్వ భవనాలు కార్యా లయాల్లో ముఖ్య మంత్రి, మంత్రులు, ఎంపీలు,ఎమ్మెల్యేల ఫొటోలు ఉండకూడదని ప్రభుత్వ ప్రకటనలు,వాల్ రైటింగ్ లు, పోస్టర్లు, కటౌట్లు, బ్యానర్లు, జండాలు వంటివన్నీ తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని కిందిస్థాయి అధికారులకు ఆదేశించారు. బస్టాండు,రైల్వే స్టేషన్‌లో రోడ్లు, వంతెనలు, ప్రభుత్వ ,ప్రైవేటు వాహ నాలు, విద్యుత్ స్తంభాలు ,మున్సిపల్ సమావేశ ప్రదేశాల్లో రాజకీయపరమైన అడ్వర్టైజ్‌మెంట్లు వంటి వాటిపై దృష్టి సారించాలని తెలిపారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో సత్తెనపల్లి పట్టణంలో వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు మున్సిపల్ అధికారులు ముసుగులు వేశారు. అలాగే రాజాకీయ పార్టీల నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బ్యానర్లు తొలగించారు. సత్తెనపల్లి తాలూకా సెంటర్‌లో జగన్మోహన్ రెడ్డి, అంబటి రాంబాబుల భారీ కటౌట్‌ను తొలగించారు. హోర్డింగులకు కట్టిన రాజకీయ పార్టీల బ్యానర్లు తొలగించారు. పలు కూడళ్లలో ఉన్న ఎన్టీఆర్, వైయస్ రాజశేఖరరెడ్డి, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాలకు మున్సిపల్ అధికారులు ముసుగులు తొడిగారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని మున్సిపల్ కమిషనర్ కె.షమీ హెచ్చరించారు.

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణలో రాజకీయ నాయకుల, పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలను సిబ్బంది సహాయంతో పురపాలక శాఖ అధికారులు తొలగించారు. పట్టణ ప్రధాన కూడలి వార్డుల్లోని రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడిగారు. మున్సిపల్ కమిషనర్ దేవుండ్ల వెంకటదాసు మాట్లాడుతూ ఎన్నికల నియమావళి, నిబంధన ప్రకారం నడుచుకోవాలని కోరారు.

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని, చిలకలూరిపేటలోని 11 సెంటర్లలో పదో తరగతి పరీక్షలు జరుగుతాయని మండల విద్య శాఖాధికారి కె.లక్ష్మీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వ హించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఈ పరీక్షలు ఈ నెల 30 వరకు జరుగుతాయన్నారు. ఆయా తేదీల్లో పరీ క్షలో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యా హ్నం 12:45 గంటల వరకు జరుగుతాయన్నారు. పరీక్షలు రాసే విద్యా ర్థులను ఉదయం 9 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతించేలా ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు చేశామని, ఈ పరీక్షలకు 2,625 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలల నుంచి బాలురు 554, బాలికలు 459, ప్రైవేటు స్కూళ్ల నుంచి బాలురు 753, బాలికలు 542, మిగిలిన వారు 327 మంది గత ఏడాదిలో ఫెయిల్ అయిన వారని తెలిపారు.

పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్‌తో వద్దు

ప్రజాశక్తి - రెంటచింతల

నేటి నుంచి ప్రారంభమయ్యే 10 పరీక్షలకు సెల్ ఫోన్‌ను పరీక్ష కేంద్రాల్లోకి తీసుకొస్తే సంబంధిత అధికారులను సస్పెండ్ చేస్తామని జరుగుతుందని సత్తెనపల్లి డిప్యూటీ ఈవో వెంకటేశ్వరరావు హెచ్చ రించారు. ఆదివారం కారంపూడి, రెంటచింతల మండలాల్లోనే ఏడు పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పరీక్షలు నిర్వహించే చీఫ్‌లు, డిపార్ట్మెంట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది స్క్వాడ్ తో సహా ఇతర అధికారులందరికీ ఈ నిబంధన వర్తిస్తుందని స్పష్టం చేశారు. తనిఖీలకు వచ్చే వారు కూడా వారి సెల్‌ఫోన్‌ను బయటపెట్టాల్సిందేనని అన్నారు. రెంటచింతలలోనే నాలుగు సెంటర్లలో 38 మంది ఇన్విజిలేటర్లను నియమించామని పరీక్ష పత్రాలు స్టేషన్ కు చేరాయని చెప్పారు. ఆర్టీసీ వారిని విద్యార్థుల కోసం బస్సులు ఏర్పాటు చేయమని ఆర్టీసీ వారిని కోరినట్లు వివరించారు.

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పెదకూరపాడు మండల విద్యాశాఖ అధికారి ఏకుల ప్రసాదరావు తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాలను పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెదకూరపాడు లోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఏర్పాటు చేశామని, 810 విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. మండలం లోని అన్ని ప్రభుత్వ ,ప్రైవేట్ పాఠశాలలు సోమవారం నుండి ఉదయం 7:45 నుండి మధ్యాహ్నం 12:30 వరకు నిర్వహించాలని తెలిపారు.

జిల్లా అటవీ శాఖ అధికారి రామచంద్రయ్యతో సిబ్బంది

పులుల సంచరించే ప్రాంతాల్లో

ప్రజలను అప్రమత్తం చేయాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో అడవి శివారులో ఉన్న గ్రామాలలో పులులు సంచరిస్తున్నట్లు గుర్తిస్తే ఆ ప్రాంత ప్రజలను అటవీశాఖ అప్రమత్తం చేయడంతో పాటు పులుల సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అటవీ శాఖ సిబ్బందిని జిల్లా అటవీ శాఖ అధికారి ఎన్ రామచంద్రయ్య ఆదేశించారు. నరసరావుపేట మండలంలోని కోటప్పకొండ వద్ద ఆదివారం నాగార్జునసాగర్ టైగర్ రిజర్వ్ మరియు ఫారెస్ట్ సిబ్బంది అధ్వర్యంలో పల్నాడు డివిజన్ పరిధిలో పులులు సంచార ప్రాంతాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సిబ్బందికి వివరించారు. వన్యప్రాణుల సంరక్షణకు అటవీ శాఖ ఎంతో ప్రాధాన్యతనిస్తుందని వన్యప్రాణులను వేటాడినా, వన్యప్రాణుల జంతు కళేబరాలు, కొమ్ములు కలిగి ఉన్నా అటవీ శాఖ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించేలా అటవీ శాఖ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో వినుకొండ అటవీ శాఖ క్షేత్ర అధికారి సయ్యద్ హుస్సేన్,సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యారోగ్య శాఖ సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం

రేపు ప్రత్యేక స్పందన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కె.నివాస్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి ఆదివారం ప్రకటనలో తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ పల్నాడు జిల్లా పరిధిలో పనిచేసే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు శాఖా పరమైన సమస్యలతో పాటు తమ వేతనాలకు సంబంధించిన సమస్యలు ఉన్నట్లయితే మంగళవారం జరిగే కార్యక్రమంలో నేరుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు.జిల్లాలో వచ్చిన వినతి పత్రాలను సమీకరించి విజయవాడ ప్రజా ఆరోగ్య డైరెక్టర్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వేతన సమస్యలపై వినతులు సమర్పించడానికి ఉద్యోగులకు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు ఇది చివరి అవకాశమని పేర్కొన్నారు.

మనస్పర్ధలు పక్కన పెట్టి సమన్వయంతో పనిచేయండి

పెదమక్కెనలో ముఖ్య నేతల సమావేశంలో నిమ్మకాయల రాజనారాయణ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండల పెద్దమక్కనలో పార్టీ నాయకులతో గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ ఆదివారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ తన పాలనలో పారదర్శకంగాసంక్షేమాన్ని అందించారని అన్నారు. అంబటి రాంబాబు తన నియో జక వర్గంలో వేధింపులు లేని పరిపాలనను అందిచారని చెప్పారు. మనస్పర్ధలు పక్కన పెట్టి , లోపాలను సవరించుకొని నాయకులు అందరూ సమన్వయంతో ఎన్నికల్లో పనిచేయాలని సూచిం చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వద్దుల రామకృష్ణారెడ్డి, సానికొమ్ము శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపిటిసి వెంకటప్పారెడ్డితో మాట్లాడారు.

వైసిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - బెల్లంకొండ

బెల్లంకొండ మండలం వైసిప్టి కార్యాలయాన్ని జడ్పీటిసి సభ్యులు గాదె వెంకటరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పాపాయపాలెం నాయకులు, మాజీ ఎంపిటిసి అక్కల వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

తెనాలి బండ్‌పై ఏర్పాటైన విగ్రహాలు

బండ్‌కు చేరిన జాన్సన్ విగ్రహంతో విగ్రహనిర్మాణ కమిటీ

ఆంధ్రా ప్యారిస్‌లో హైదరాబాద్ తరహాలో 'తెనాలి బండ్'

- తెనాలి కళావైభవానికి ప్రతీకగా కొలువుదీరుతున్న ప్రముఖుల విగ్రహాలు
- త్వరలో ఆవిష్కరించనున్న సినీరచయిత మోదుకూరి జాన్సన్ విగ్రహం

ప్రజాశక్తి-తెనాలి

ఆంధ్రా ప్యారిస్ సుందరీకరణలో మరో అడుగు ముందుకు పడింది. హైదరాబాద్ ట్యాంక్ బండ్ తరహాలో 'తెనాలి బండ్' తుది మెరుగులు దిద్దుకుంటుంది. తెనాలి ప్రాంత రాజకీయ ప్రముఖులు, కవులు, కళాకారుల విగ్రహాల ఏర్పాటుకు సిద్ధమవుతున్న తెనాలి బండ్‌పై ఇప్పటికే కొందరి విగ్రహాలు కొలువుదీరాయి. తాజాగా ప్రముఖ సినీ రచయిత మోదుకూరి జాన్సన్ విగ్రహాన్నీ ఏర్పాటు చేయగా త్వరలో ఆవిష్కరించనున్నారు.

ఎంతో చైతన్యవంతమైన తెనాలి ప్రాంతం రాజకీయం, విద్య, వైద్యం, క్రీడా రంగాలతో పాటు కవులు, కళాకారులకు నిలయం. అన్నిరంగాల్లో తనకంటూ ప్రత్యేకతను సంతరించుకున్న తెనాలిలో హైదరాబాద్ తరహా 'తెనాలి బండ్' ఏర్పాటు చేపట్టారు. తెనాలి-విజయవాడ మెయిన్ రోడ్డులోని బస్టాండ్ నుంచి ఆటోనగర్ వరకూ గల నాలుగులైన్ల రోడ్డు ఎడమవైపు మార్జిన్ ఫుట్‌పాత్‌ను తెనాలి బండ్‌కు ఎంపిక చేశారు. తెనాలి ప్రాంత కీర్తిని దేశ నలుదిశలూ చాటిన మహనీయుల విగ్రహాలను 'తెనాలి బండ్'పై ఏర్పాటు చేయాలని భావించి తెనాలి బండ్ నిర్మాణం, దానిపై ఏర్పాటు చేయాల్సిన విగ్రహాలపై ఓ కమిటీని వేశారు. పురపాలక సంఘం 14వ ఆర్థిక సంఘం నిధులు, ప్రభుత్వ నిధులతో 2021 డిసెబంర్ 10న తెనాలి బండ్‌కు శంకుస్థాపన చేశారు. అయితే వివిధ కారణాలతో పనుల్లో తీవ్ర జాప్యమైనా ప్రస్తుతం పనులు శరవేగంగా సాగుతున్నాయి. విగ్రహాల ఏర్పాటుకు ఫుట్‌పాత్, దిమ్మెల నిర్మాణం పూర్తయింది. మార్బుల్, గ్రానైట్‌తో దిమ్మెలకు సొబగులద్దారు. వారిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని నటరాజ్ జ్యూయలర్స్ అధినేత కొత్తమాసు కుమార్, విజయభాస్కర్ ఏర్పాటు చేయగా, ఎమ్మెల్యే ఆవిష్కరించారు. బిజెపి నాయకులు తమిరిశ రామాచార్యులు విగ్రహాన్ని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, ఎమ్మెల్యే కలిసి ఆవిష్కరించారు. ప్రముఖ సినీనటులు గుమ్మడి వెంకటేశ్వరరావు విగ్రహాన్ని, వేద సంస్కృత పాఠశాలను ఏర్పాటు చేసిన పండిత యలవర్తి ఆంజనేయశాస్త్రి విగ్రహావిష్కరణలు పూర్తయ్యాయి.

ఇటీవలే ఆవిష్కరించిన రోశయ్య విగ్రహం

తెనాలి బండ్‌కు చేరిన మోదుకూరి జాన్సన్ విగ్రహం

మండలంలోని కొలకలూరుకు చెందిన ప్రముఖ సినీ, నాటక రచయిత, సినీ నటులు మోదుకూరి జాన్సన్ కాంస్య విగ్రహం తెనాలి బండ్‌కు చేరింది. గ్రామానికి చెందిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ పొన్నెకంటి జోసఫ్ రత్నాకర్ సారధ్యంలో జాన్సన్ కుటుంబ సభ్యులు, గ్రామానికి చెందిన విద్యావేత్తలు, మేధావులు, అభిమానులు సమిష్టిగా ఏర్పాటు చేసిన జాన్సన్ విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. త్వరలోనే విగ్రహావిష్కరణ ఉంటుందని డాక్టర్ జోసఫ్ రత్నాకర్ చెప్పారు. విద్యుద్దీపాలంకరణ, మొక్కల పెంపకం, పురపాలక సంఘం నిత్య పర్యవేక్షణలో సందర్శకులను ఆకర్షించే రీతిలో రూపుదిద్దుకుంటున్న తెనాలి బండ్ ఈ ప్రాంత వైభవానికి చిహ్నంగా నిలవనుంది.

జాతీయ సదస్సులో నిర్మల ఫార్మసీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : 'కరెంటు డ్రగ్ డెలవరీ టెక్నాలజీస్ ఇన్నోవేషన్స్ అండ్ అప్లికేషన్స్' అంశంపై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన జాతీయ సదస్సులో మండలంలోని ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభ చాటారు. బి.ఫార్మసీ 4వ సంవత్సరం విద్యార్థులు పి.భానుశశాంక్, షేక్ షర్మిల, పి.స్వర్ణ 'యాంటీ బయాటిక్స్ - వాటి నిరోధన' అంశంపై డాక్టర్ సిహెచ్. సుప్రియ పర్యవేక్షణలో పోస్టర్ రూపంలో ప్రదర్శించి ద్వితీయ బహుమతి గెలుపొందారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ పాములరెడ్డి, సిహెచ్. సుప్రియ, అధ్యాపకులు అభినందించారు.

బాల్య మిత్రుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ : ప్రమాదవశాత్తు గాయపడిన బాల్య మిత్రుడికి మిత్ర బృందం చేయూత నిచ్చింది. పొన్నూరు పట్టణానికి చెందిన అఫ్జల్ బాషా అనే ఒక ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ తన విధి నిర్వహణలో ప్రమాదానికి గురై కిత్స పొందుతున్నారు. ఇది తెలుసుకున్న బాల్యమిత్రులు, పదో తరగతి 1992 బ్యాచ్, హెల్పింగ్ హాండ్స్ మిత్రబృందం ఆదివారం బాషాను పరామర్శించి రూ.22 వేలు అందించారు. మిత్రబృందంలో మౌలాలి, అన్వర్ బాషా, బలరాం, బ్యాంక్ ఖాజా, రహమాని, అమీనుల్లా, బాబురావు, బషీర్‌బాబు పాల్గొన్నారు.

ఆసక్తి ఉంటే అందరూ కవులే

శ్రీనివాసరెడ్డి, ప్రభుదాసును సత్కరిస్తున్న రావి రంగారావు తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

ఆసక్తి ఉంటే అందరూ కవులే అని డాక్టర్ రావి రంగారావు అన్నారు. స్థానిక బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో ఆదివారం 'అమరావతి సాహితీ మిత్రులు' నిర్వహించిన సాహిత్య సభలో ఆయన 'అందరూ కవులు కావచ్చు' అనే అంశంపై మాట్లాడారు. ప్రతివ్యక్తీ ఎంతో కొంత కవిత్వం మాట్లాడుతూనే ఉంటాడని, కానీ ఆ విషయం అతనికి తెలియదని చెప్పారు. పల్లెల్లో నిరక్షరాస్యుల సంభాషణల్లోనూ కవిత్వం కనిపిస్తుందని అన్నారు. ఆసక్తి ఉంటే చదువురాని వారు కూడా కవిత్వం చెప్పటం నేర్చుకోవచ్చని, గొప్ప కవిత్వం రాయవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా సి.ఎస్.రావు రచించిన 'అక్షర మేఘాలు' కవిత్వ సంపుటిని వి.వి.రావు విశ్లేషించారు. గోటేటి లలితా శేఖర్ రచించిన 'పుడమి తల్లి నేస్తం' కథానికల సంపుటి గురించి ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ మైలవరపు లలితకుమారి వివరించారు. సభలో ఈ మాసం కవిగా డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్ పాల్గొని కవితలు వినిపించారు. సంస్థ కన్వీనర్ పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన కవి సమ్మేళనంలో ఎం.మాధవి, సత్యవతి, షేక్ కాసింబి, ఎం.శ్రీనివాసరెడ్డి, ఎస్.రవికుమార్, కె.జయకుమార్, ఎస్.కనకదుర్గ, టి.ధనుంజయరెడ్డి, ఎన్.పూర్ణప్రజ్ఞాచారి, సిహెచ్.వెంకటరత్నం, ఆర్.రాజ్ కృష్ణ, సురేష్‌బాబు, శేషమాంబ, జి.బసవజు తదితరులు కవితలు వినిపించారు. 'నిక్కచ్చి కవిత'గా ఎంపికైన మెట్టు శ్రీనివాసరెడ్డిని, ఈ మాసం కవి ప్రభుదాసును సత్కరించారు. డాక్టర్ సూర్యదేవర రవికుమార్, సిహెచ్. వెంకటరత్నం, పాణిరావు యర్రగుంట్ల పర్యవేక్షించారు.

ఆటో ప్రమాద బాధితులను పరామర్శించిన జడ్పీ చైర్పర్సన్

ప్రజాశక్తి - తెనాలి : ఆటో ప్రమాదంలో గాయపడి తెనాలి జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులను జిల్లా పరిషత్ చైర్పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టీనా, వైసిపి రాష్ట్ర నాయకులు సురేష్ కుమార్ దంపతులు పరామర్శించారు. ఈనెల 15న కొల్లిపర మండలం మున్నంగికి చెందిన 10 మంది ప్రయాణిస్తున్న ఆటో ఆర్టీసీ బస్సును ఢీకొన్న సంగతి తెలిసిందే. ప్రమాదంలో గాయపడిన వారు తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న జడ్పీ చైర్పర్సన్ ఆదివారం ఆసుపత్రికి వచ్చి క్షతగాత్రుల ద్వారా ప్రమాదానికి కారణాన్ని తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై అడిగారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాల సహాయంగా ఉంటుందదన్నారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు సుద్ధపల్లి నాగరాజు, ఇతర నాయకులు ఉన్నారు.

సిపిఐ సీనియర్ నాయకులు సాంబశివరావు మృతి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి మైలార్ నగర్లోని సిపిఐ సీనియర్ నాయకులు కోడూరి సాంబశివరావు (70) ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన భార్య గతంలోనే మరణించారు. ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఆయనకు ఆదివారం తెల్లవారుజామున ఆయాసం రావడంతో చినకాకాని ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చిన్నతనం నుండి కమ్యూనిస్టు భావాలున్న సాంబశివరావు సిపిఐ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. తన పిల్లలకూ కమ్యూనిస్టు యోధుల పేర్లనే పెట్టారు. ఆయన కుమారుల్లో ఒకరైన లెనిన్.. వంట మాస్టరుగా మంగళగిరి ప్రాంతంలో ప్రసిద్ధి. శాలివాహన సంఘం నాయకులుగానూ ఉన్నారు. సాంబశివరావు మృతికి సిపిఐ, సిపిఎం, ఇతర రాజకీయ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

27వ వార్డు మహిళల సమ్మేళనం

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక 29వ వార్డు అంజుమన్ ఉర్దూ స్కూల్ వద్ద మాజీ కౌన్సిలర్ షేక్ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో 27వ వార్డు మహిళల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల కలిసి హాజరయ్యారు. లావణ్య మాట్లాడుతూ మహిళల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైసిపిని ఆదరించాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

లోకేష్ గెలుపునకు కృషి చేయాలి : టిడిపి

ప్రజాశక్తి-తాడేపల్లి

రానున్న ఎన్నికల్లో మంగళగిరి నియోజకవర్గంలో టిడిపి గెలుపు కోసం కృషి చేయాలని, నారా లోకేష్‌ను గెలిపించుకోవాలని స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో గిరిజన నాయకులు పిలుపునిచ్చారు. నియోజకవర్గ ఎస్‌టి సెల్ అధ్యక్షులు ఇట్టా భాస్కర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ మాజీ సభ్యులు డాక్టర్ కొండారెడ్డి నరహరిప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న 13 వేల ఓట్లు జాగ్రత్తగా పోల్ చేయించాలని కోరారు. ఇందుకు నిర్మాణాత్మకంగా పని చేయాలన్నారు. ప్రతి గడపకు వెళ్లి ప్రచారం నిర్వహించాలని, అమరావతిని అడ్డుకున్న వైసిపిని ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా, నియోజకవర్గ నాయకులు ఇ.ప్రసాద్, పి.శ్రీనివాసరావు, శ్రీనివాసులు నాయక్ పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్త మృతికి సంతాపం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

మండలంలోని మామిళ్లపల్లికి చెందిన వైసిపి కార్యకర్త సజ్జా తిరుమలరావు ఆదివారం మృతి చెందిన నేపథ్యంలో భౌతిక కాయాన్ని వైసిపి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ సందర్శించి నివాళులర్పించారు. మృ తుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట వైసిపి నాయకులున్నారు. ఇదిలా ఉండగా మండల ంలోని ఆరమండలో ఆరమండమ్మ తల్లి గ్రామో త్సవం ఆదివారం జరిగింది. అంబటి మురళీకృష్ణ సందర్శించారు. తిరుణాళ్లకు ప్రభలతో వచ్చిన ట్రాక్టర్లను నడిపారు.

పోరాటాల ద్వారానే ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - మేడికొండూరు

ఆశ వర్కర్లు సుదీర్ఘ పోరాటం అనంతరం పలు విజయాలు సాధించారని, సమస్యలను పరిష్కరించు కోగలిగారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. మండలంలోని పేరేచర్లలో ఆదివారం ఎస్.సుజా త అధ్యక్షతన ఆశా వర్కర్ల అభినందన సభ జరిగింది. నేతాజి మాట్లాడుతూ ఒకప్పుడు పనిని బట్టి పారితోషికం పేరుతో నెలకు రూ.25-50 మాత్రమే పొందిన ఆశా వర్కర్లు తమ పోరాటాల ద్వారా ఇప్పుడు నెలకు రూ.10 వేల జీతం పొందగలుగుతున్నారని అన్నారు. 15 ఏళ్లుగా జరిగిన పోరాటాల ఫలితంగా ఆశా వర్కర్లు యూనిఫారం, బ్యాంకు ద్వారా జీతాలు, వేతనంతో కూడిన 180 రోజుల మెటర్నిటీ లీవులు, రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంపు, రిటైర్మెంట్ సందర్భంగా రూ.60 వేలు, చనిపోయిన ఆశా వర్కర్ల మట్టి ఖర్చులకు రూ.20 వేలు తదితర కోర్కెలు సాధించుకోగలిగారని అన్నారు. అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా ఆశా వర్కర్ల పోరాటాలను నిర్బంధం ద్వారా అణచాలని చూసినా ఆశ వర్కర్లు వాటన్నింటినీ ప్రతిఘటించి ఐక్యంగా పోరాటం ద్వారా ఈ విజయాలు సాధించారని చెప్పారు. ఇదే క్రమంలో మరికొన్ని సమస్యలు పరిష్కారం కావాల్సి ఉందని, కనీస వేతనాలు, పెన్షన్ తదితరాలు సాధించుకోవాల్సి ఉందని చెప్పారు. వీటి కోసమూ

పోరాటాల వారసత్వాన్నే కొనసాగించాలని పిలుపునిచ్చారు. స్థానికంగా కొంతమంది అధికారులు ఆశ వర్కర్లతో జాబ్ చార్టులో లేని పనులు చేయిస్తున్నారని, వీటిని రాష్ట్ర అధికారులు ఇచ్చిన ఉత్తర్వులకు విరుద్ధంగా చేయిస్తున్నారని అన్నారు. వాటన్నిటినీ తక్షణమే నిలుపుదల చేయాలని, లేకుంటే స్థానికంగా కూడా ఆందోళన చేయాల్సి వస్తుందని చెప్పారు. సమావేశంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు అరుణ, పద్మ, రూతమ్మ పాల్గొన్నారు.

గేట్‌లో కఠెవరం విద్యార్థికి ఆల్ ఇండియా టెన్త్ ర్యాంక్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

2024 గేట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ టెస్టులో తెనాలి మండలం కఠెవరానికి చెందిన యర్రు లక్ష్మీ సాయికృష్ణకు ఆల్ ఇండియా స్థాయిలో 10వ ర్యాంక్ లభించింది. లక్ష్మీ సాయికృష్ణ 10 జిపిఎతో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించగా, ఇంటర్‌లో 97.7 శాతం, బీటెక్‌లో 9.23 జిపిఎతో ఉత్తీర్ణత సాధించినట్లు తల్లితండ్రులు సాంబశివరావు, అరుణ తెలిపారు. భవిష్యత్తులో ఐఐటి ముంబైలో ఎంటెక్ విద్యను అభ్యసిస్తానని సాయికృష్ణ తెలిపారు. సాయికృష్ణకు పలువురు అభినందనలు తెలిపారు.

ఆల్ ద బెస్ట్

- నేటి నుండి పదో తరగతి పరీక్షలు - ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు
- గుంటూరు జిల్లాలో 31,291 మంది, పల్నాడు జిల్లాలో 29,243 మంది చొప్పున హాజరుకానున్న విద్యార్థులు
- హాల్ టిక్కెట్ చూపితే బస్సులో ఉచిత ప్రయాణం - యాజమాన్యాలు హాల్‌టిక్కెట్ నిరాకరిస్తే గుర్తింపు రద్దు

గుంటూరు పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డిఇఒ, ఇతర అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో సోమవారం నుండి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలకు అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. మార్చి 30వ తేదీ వరకూ పరీక్షలు జరుగుతాయి. ఉదయం 9.30 గంటల నుండి 12.45 గంటల వరకూ పరీక్ష ఉంటుంది. విద్యార్థులను 8.45 నుండి 9.30 గంటల వరకూ పరీక్షా కేంద్రలోకి అనుమతిస్తారు. పరీక్ష ముగిసే సమయం విద్యార్థులు వరకూ పరీక్షా కేంద్రంలోనే ఉండాల్సి ఉంటుంది. ఈ ఏడాది మాస్ పేపర్ లీకేజికి అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు డిఇఒ పి.శైలజ తెలిపారు. ప్రశ్నాపత్రంలో ప్రతి ప్రశ్నకూ బార్ కోడ్ ఉంటుందని, కావున ఏ ప్రశ్న లీకైనా అది ఎక్కడ లీకైంది అనే విషయం బయటపడిపోతుందని ఆమె చెప్పారు.

147 పరీక్షా కేంద్రాల్లో జరిగే ఈ పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు బాలికలు 13,046 మంది, బాలురు 14,320 మంది మొత్తం 27,366 మంది హాజరవుతున్నారు. అలాగే ప్రైవేటు విద్యార్థులు/ఒకసారి ఫెయిల్ అయిన విద్యార్థులు బాల బాలికలు 3925 మంది ఉన్నారు. ఆదివారం జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ స్థానిక పట్టాభిపురంలోని మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌ను సందర్శించి పరీక్షల ఏర్పాట్లు పరిశీలించి, అధికారులకు, ప్రధానోపాధ్యాయునికి పలు సూచనలు చేశారు. పాఠశాలను సందర్శించిన వారిలో ఇన్‌ఛార్జి డిప్యూటీ డిఇఒ బలరామ్‌నాయక్, ఉర్దూ డిఐ ఖాసిం, పాఠశాల హెచ్ఎం వీరబాబు ఉన్నారు.

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు

సోమవారం నుండి 30వ తేదీ వరకూ జరిగే పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు చెప్పారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్ష ఉంటుందన్నారు. జిల్లాలో 10వ తరగతి పరీక్షలకు 29243 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, వీరిలో 15151 మంది బాలురు, 14092 మంది బాలికలు ఉన్నారని, పరీక్షల నిర్వహణకు 127 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లు నిర్వహించకూడదని హెచ్చరించారు. పరీక్ష తేదీల్లో సెంటర్ సమీపంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, విద్యుత్ కోతలు లేకుండా విద్యుత్ శాఖ అధికారులతో మాటాల్డఆమని చెప్పారు. కేంద్రాల తనిఖీకి వచ్చే అధికారులు సైతం తమ ఫోన్లను గది వెలుపలే విడిచిప లోపలికి వెళ్లాలన్నారు.

పరీక్షలకు హాజరయ్యే వికలాంగ అభ్యర్థులకు స్క్రైబ్స్‌గా 9వ తరగతి విద్యార్థులను అనుమతించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రతి ప్రశ్నాపత్రానికి క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశామని, ఒకవేళ ప్రశ్నాపత్రం లీక్ అయితే ఆ ప్రశ్నాపత్రం ఏ పరీక్ష కేంద్రం నుండి లీక్ అయ్యిందో తెలుసుకోవచ్చని తెలిపారు. పరీక్షల నిర్వహణలో 12 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్, 80 మంది సిట్టింగ్ స్క్వాడ్, 25 మంది రూట్ మరియు అసిస్టెంట్ రూట్ ఆఫీసర్స్‌ను నియమించామన్నారు. డిఇఒ కార్యాలయంలో 9963192487, 6281081702 నంబర్లతో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణకు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలూ కల్పించామన్నారు. పరీక్షల సమయంలో ఎక్కడైనా అవకతవకలు జరిగినట్లు తెలిస్తే సదరు పరీక్ష కేంద్రంలోని సిఎస్, డిఒలు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ

సోమవారం నుండి 30వ తేదీ వరకు మధ్యాహ్నం 2.30 నిమిషాల నుండి సాయంత్రం 5:30 వరకు సార్వత్రిక విద్యాపీఠం ఎస్ఎస్‌సి, ఇంటర్ పరీక్షలు జరుగుతాయని, 4172 మంది హాజరయ్యే ఈ పరీక్ష నిర్వహణకూ ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. పరీక్షల నిర్వహణకు 8 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు కూడా ఫ్లైయింగ్ స్క్వాడ్ మరియు సిట్టింగ్ స్క్వాడ్‌ను నియమించామన్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే వికలాంగ విద్యార్థులకు స్క్రైబ్స్‌గా 9వ తరగతి విద్యార్థులకు అనుమతి ఉంటుందని తెలిపారు. ఇంటర్ పరీక్షలు రాసే వికలాంగులకు స్క్రైబ్స్‌గా 10వ తరగతి వారిని అమనుమతిస్తామన్నారు.

ఫీజు నెపంతో హాల్ టికెట్ ఇవ్వకుంటే పాఠశాల గుర్తింపు రద్దు

ఫీజు బకాయి పేరుతో హాల్ టికెట్ ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే అలాంటి స్కూళ్ల గుర్తింపు రద్దు చేస్తామని డిఇఒ హెచ్చరించారు. ఈ విషయమై తల్లిదండ్రులు తమకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అయితే స్కూళ్లలో ఇచ్చే వాటితో పనేలేదని, వెబ్సైట్ నుంచి నేరుగా హాల్‌టిక్కెట్ డౌన్లోడ్ చేసుకుని, వాటితో కేంద్రాలకు వెళ్తే పరీక్షలు రాసేందుకు అనుమతించేలా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. హాల్‌టికెట్ చూపి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా పరీక్ష కేంద్రాలకు ప్రయాణించే అవకాశం కల్పించామని తెలిపారు.

స్పందన రద్దు

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగే స్పందన కార్యక్రమం రద్దు అయ్యింది. కోడ్ అమలులో ఉన్నంత కాలం ఈ రద్దు ఉంటుందని , ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని గుంటూరు, పల్నాడు జిల్లా కలెక్టర్లు ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎల్.శివశంకర్ ఆదివారం వేర్వేరుగా ప్రకటనలు జారీ చేశారు. గుంటూరు నగర పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారినికి కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించినే స్పందన రద్దు చేసినట్లు కమిషనర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు స్థానిక సమస్యలపై జిఎంసి కాల్ సెంటర్ 0863-2345103 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

తాటి ముంజలు.. ఆరోగ్యానికి ఎంతో మేలు..

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రస్తుతం అన్ని రకాల ఆహార పదార్థాల ఉత్పత్తిలో మందుల పిచికారీ తప్పనిసరి. కూరగాయలు దగ్గర నుండి పండ్లు చివరకు కొబ్బరి బొండాలలో కూడా హైబ్రిడ్ రకాలు రావడం, చీడ పీడలు, తెగుళ్లు సులువుగా ఆశించడంతో వాటి నివారణకు మందులు పిచికారీ చేసి కాపాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనూ సూక్ష్మ పోషకాల ఎరువులు లేని ఆహారం పదార్థం ఉందంటే కేవలం ఒక్క తాటి ముంజలుగా చెప్పుకోవచ్చు. వేసవిలోనే దొరికే తాటి ముంజలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. విటమిన్- ఎ, బి, సి, ఐరన్, జింక్, ఫాస్ఫరస్, పొటాషియం, కాల్షియం, విటమిన్స్, మినరల్స్ పుష్కలంగా దాగి ఉన్న తాటి ముంజలు తినడం ద్వారా శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

తాటి ముంజల్లో ఉండే పొటాషియం రక్తపోటును అదుపు చేసి గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. శరీరంలో ఉష్ణోగ్రత తగ్గించి జీర్ణక్రియ వ్యవస్థను మెరుగు పరుస్తుంది. గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. తాటి ముంజల్లో కొవ్వు పదార్థాలు తక్కువ ఉండడం వల్ల చిన్నపిల్లల్లో గుండె ఆరోగ్యానికి, షుగర్ వ్యాధిగ్రస్తులకు మేలు జరుగుతుంది. వీటిల్లో నీటి శాతం ఎక్కువ ఉండటం వల్ల వేసవిలో వడదెబ్బ తగలకుండా చేయడం శరీరాన్ని చల్లబరచడంతో పాటు శరీరబరువు తగ్గించడం, చెడు కొలెస్ట్రాల్ తగ్గి, మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. శరీరంలోని హానికర వ్యర్థ పదార్థాలను తొలగించి లివర్ సంబంధిత సమస్యలను తాటి ముంజలు తగ్గిస్తాయి. ఆడవాళ్లలో బ్రెస్ట్ కేన్సర్ ముప్పు తగ్గించడం, కేన్సర్ కణాలను అడ్డుకోవడానికి ఉపయోగపడతాయి. గ్లూకోజ్ స్థాయిని పెంచి శరీరానికి కావాల్సిన మినరల్స్ క్రమబద్ధీకరణ చేయడంలో తాటి ముంజలు కీలక పాత్ర పోషిస్తాయి. వేసవిలో ఎండ కారణంగా వచ్చే వికారం, వాంతులు, చికెన్ పాక్స్‌ను ముంజలు నివారిస్తాయి.. అని వైద్యులు సూచిస్తున్నారు.

నూతన కార్యవర్గం

గ్రంథాలయ సంస్థ పెన్షనర్ల సంఘం కార్యవర్గ ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అరండల్‌పేట, జిల్లా కేంద్ర గ్రంథాలయంలోని సమావేశ మందిరంలో ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్ల సంఘానికి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా తిరుమలశెట్టి నరసింహారావు, పరిసా సాంబశివరావు, సజ్జా మధుసూదనరావు, గౌరవాధ్యక్షులుగా కావూరి నారాయణరావు, జె.జగన్మోహనరెడ్డి, అధ్యక్షులుగా వల్లూరు వెంకటరమణ, అసోసియేట్ అధ్యక్షులుగా కోన దేవదాసు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఎం.సుభాని, ఉపాధ్యక్షులుగా కందుల ఝాన్సీలక్ష్మి, సూదినేని మల్లికార్జునరావు, కోశాధికారిగా గౌరవరపు గురవయ్య, సహాయ కార్యదర్శిగా నూతలపాటి శివయ్య, కార్యవర్గ సభ్యులుగా కరణం వెంకటేశ్వర్లు, కొండూరు వెంకటేశ్వర్లు, అన్నపురెడ్డి రామకష్ణరెడ్డి, పోగుల రామలింగేశ్వరశర్మ, ఆలపాటి వెంకటరమణ, జి.ఎస్.ఎస్.వి. ప్రసాద్, దంటూ నిర్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన వి.వి.రమణ, ఎస్.ఎం. సుభాని మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. అనంతరం ఎన్నికైన కార్యవర్గాన్ని కార్యాలయ సిబ్బంది కంపా శ్రీనివాసరావు, కె.రాజేష్ సత్కరించి అభినందనలు అందచేశారు.